


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-81-

## పరదేశంలో ప్రణ(ళ)యం

**దు:ఖంతో** ముక్కుపుటాలు అదురుతున్నాయి. హృదయం భగ్గుమంటోంది. ఇంత మోసమా. రంగులు పూసిన అబద్ధపు మాటలతో ఎంతగా నమ్మించాడు. జీవితాంతం తోడుంటానని పిల్లా పాపలతో సంతోషంగా కాలం గడుపుదామని ఎన్ని కబుర్లు చెప్పాడు.

ఇప్పుడు ఈ కువైట్ లో పెళ్ళి చేసుకున్న పెళ్ళాన్ని వదిలేసి తన దేశం వెళ్ళిపోతాడట. తల్లి చెప్పినట్లు చిన్నాన్న కూతురిని పెళ్ళి చేసుకుంటాడట.(ముస్లింలు చిన్నాన్న, పెదనాన్న, పిన్ని, పెద్దమ్మ పిల్లలను కూడా చేసుకుంటారు). ఆ మాట విన్నప్పటినుండీ మిన్ను విరిగి మీద పడ్డట్టుగా వుంది. ఊపిరి ఆడటం లేదు. ఉక్రోషం తన్నుకొస్తోంది. ఫిరోజ్ కి ఎలా మనసొప్పుతోంది? ఆవేశం, ఆవేదన పోటీపడగా కోపంగా లేచి అతని కాలర్ పట్టుకుంది రమ్య.

"నన్నూ, ఈ కువైట్ దేశాన్ని విడచి నువ్వు ఒక్కడుగు బయటికి వెయ్యలేవు. అబద్ధపు ప్రేమతో నన్ను వంచించి నీ కామాన్ని చల్లార్చుకుని కాలక్షేపం చేసి ఈ రోజు నా దేశానికి వెళ్ళిపోతా అంటూ సామాన్లు సర్దుకుంటున్నావు. నాలుగేళ్ళు కువైట్ లో కాపురం చేసి నన్ను వదిలేసిపోతానంటున్నావు. నీకు హృదయముందా. మనిషివేనా. స్త్రీ హృదయాన్ని గాయపరచకు. ప్రేమించు ప్రాణమిస్తుంది. వంచన చేస్తే ప్రాణం తీస్తుందని గుర్తుంచుకో" అరిచింది రమ్య.

"ఏం చేస్తావే నన్ను. ఎలా ఆపగలవు. ఇన్నేళ్ళూ నిన్ను పోషించాను. అందుకు సంతోషించు" కోపంగా బదులిచ్చాడు ఫిరోజ్.

"నన్ను పెళ్ళి చేసుకోలేదా? వుంచుకున్నావా?" ప్రశ్నించింది రమ్య.

"ఈ కువైట్ దేశంలో చేసుకున్న పెళ్ళిళ్ళకు విలువ వుందనుకుంటున్నావా. మగాడు ఆడదానికోసం వంద అబద్ధాలు ఆడతాడు. నమ్మి పడిపోవడమేనా" ఎదురు ప్రశ్నించాడు ఫిరోజ్.

"ఏయ్ పాకిస్తానీ నిన్ను నమ్మిన స్త్రీకి ద్రోహం చేస్తావా. నీ మతమూ, నీ ఖురాన్ గ్రంధమూ, నీ దేవుడు అల్లా నిన్ను

శిక్షించడా. ప్రేమను కాక శరీరాన్ని మాత్రమే పంచుకునే మృగం లా ప్రవర్ధించకు" కన్నీళ్ళతో ఆవేశంగా అరిచింది రమ్య.

"నన్ను మృగం అంటావా నిన్ను చంపేస్తా" మీదకి వచ్చాడు ఫిరోజ్.

"చంపెయ్ అదే మంచిది. నిన్ను నమ్మినందుకు ఈ శిక్ష నాకు పడాల్సిందే" అంటూ ఏడవడం మొదలు పెట్టింది రమ్య.

కొంచెం వెనక్కి తగ్గాడు ఫిరోజ్.

"నన్నేం చెయ్యమంటావ్ చెప్పు. నువ్వంటే నాకిష్టం లేదా ఏమి? నిన్ను వదులుకోవాలని నాకూ లేదు.మా అమ్మా నాన్నా నాకు పెళ్ళి చెయ్యాలని తొందర పడుతున్నారు. నాలుగేళ్ళనుండీ ఇంటికి వెళ్ళక పోయేసరికి కంగారు పడుతున్నారు. నేను పాకిస్తానీ నువ్వు ఇండియన్ అవడం వల్లనే ఈ సమస్య ఎదురయింది. లేకపోతే ఇంత తలనొప్పి వుండేది కాదు" తల పట్టుకున్నాడు ఫిరోజ్.

"నీది పాకిస్థాన్ లోని పంజాబ్ రాష్ట్రమనే విషయాన్ని దాచిపెట్టి ఇండియాలోని పంజాబ్ రాష్ట్రమని అబద్ధాలు చెప్పి నన్ను పెళ్ళి చేసుకున్నావు. నన్ను మోసం చేసావు. నా జీవితం నాశనం చేసావు. ఇది న్యాయమా. ముస్లింలు అబద్ధాలు ఆడరు ఐదుసార్లు నమాజ్ చేస్తారు అని నీతులు చెప్పావు. నీ కోసం నీ ప్రేమ కోసం నేను నా పేరు కూడా ఫాతిమా గా మార్చుకుని ఇస్లాం మతాన్ని స్వీకరించాను. నీతోపాటూ మక్కా వచ్చి ఉమ్రా చేసాను. నువ్వే సమస్తం, సర్వస్వం అనుకుంటే నాకింత ద్రోహం చేస్తావా. నువు విశ్వసించే నీ దేవుడు అల్లా అలా చెయ్యమని చెప్పాడా" ఆవేశంగా ప్రశ్నించింది రమ్య.

దేవుని మాట వచ్చేసరికి కాస్త శాంతించాడు ఫిరోజ్.

"నిజమే రమ్యా నీ కోసం అబద్ధాలు ఆడాను. నీ మీద ప్రేమతో నాది కూడా మీ భారత దేశమే అని చెప్పి నిన్ను పెళ్ళి చేసుకున్నాను. జీవితంలో ఒక్కసారైనా వెళ్ళాలని కలలు కనే ముస్లింల పవిత్రస్థలం మక్కాకు కూడా నిన్ను తీసుకెళ్ళాను. ఆ మసీదులో కాబాఎదుట నువ్వే నా భార్యవని ఒప్పుకున్నాను. కానీ ప్రస్తుతం నా పరిస్థితి బాలేదు. ఇంటి దగ్గర వత్తిడి ఎక్కువైంది. నేను నా దేశానికి వెళ్ళిపోవాలి. లేకపోతే మా అమ్మా నాన్నా ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతామని బెదిరిస్తున్నారు. నాకు దిక్కు తోచడం లేదు. దయచేసి నన్ను వెళ్ళనివ్వు. నేను నీకోసం ప్రతిరోజూ దువా చేస్తాను. అల్లా నిన్ను చల్లగా చూస్తాడు" అర్థింపుగా చెప్పాడు ఫిరోజ్.

"నిన్ను వదిలి నేను వుండలేను ఫిరోజ్. స్త్రీ ప్రేమిస్తే, పెళ్ళి చేసుకుంటే ఆ పురుషునితోనే జీవితాన్ని

గడపాలనుకుంటుంది. నన్ను కూడా నీతోపాటూ పాకిస్తాన్ కి తీసుకుపో." స్థిరంగా చెప్పింది రమ్య.
ఉలిక్కిపడ్డాడు ఫిరోజ్. "ఏంటీ నాతో పాటూ పాకిస్తాన్ వస్తావా. మతి వుండే మాట్లాడుతున్నావా. భారతీయులు పాకిస్తాన్ లోకి ప్రవేశించడం సులభం కాదు. ముందే రెండు దేశాలమధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత శత్రుత్వం వుంది. మా వాళ్ళు అసలే ఛాందసవాదులు. నువ్వు భారతీయురాలివని తెలిస్తే నిన్ను చంపి అవతలపారేస్తారు. అనుకున్నంత సులభం కాదు" అనునయిస్తూ చెప్పాడు ఫిరోజ్.
"ప్రాణానికి నేను భయపడను. నీకంటే నా ప్రాణం నాకు ముఖ్యం కాదు.
అరవై సంవత్సరాల ముందు ఆంగ్లేయుల పాలన వరకూ పాకిస్థాన్ ఇండియాలోని అంతర్భాగమని, తరువాతే విడిపోయాయని, రెండూ ఒకటేనని ఒకే నేల, ఒకే గాలి, ఒకే రక్తమని మన తాతముత్తాతలు ఒకరేనని నువ్వే నాకు వివరించి చెప్పావు. నేను కూడా నీతో పాటూ వస్తాను. అల్లా సాక్షిగా ఎన్నడూ విడువనని ప్రమాణం చేస్తూ కువైట్ కోర్టులో పెళ్ళి చేసుకున్న భార్యను నీ దేశానికి తీసుకెళ్ళే ధైర్యం నీకు లేదా? కువైట్ లో నీ భార్యను ఇలా గాలికివదిలేసి వెళ్ళిపోతావా, ఖురాన్ ఇదేనా నీకు బోధించింది చెప్పు" ఆవేదనగా అడిగింది రమ్య.
"రమ్యా అవన్నీ జరిగే పనులు కావు. అనుకున్నవన్నీనిజం అవవు. జీవితం కష్టమైనది. మా ఎంబసీ నీకు వీసా ఇవ్వడానికి ఒప్పుకోదు. భారతీయురాలిని తప్ప వేరే ఏ దేశస్తురాలినైనా సరే పాకిస్తాన్లో అడుగు పెట్టడానికి అంగీకరిస్తుంది. ఏ అభ్యంతరం చెప్పదు. ఒకవేళ కష్టంమీద వీసాఇచ్చినా, నువు మా దేశం వచ్చినా, తరువాత జరిగే పరిణామాలు ఘోరంగా వుంటాయి. నువ్వు నీ దేశాన్ని, నీ వాళ్ళను మర్చిపోవాల్సి వుంటుంది.
మా దేశంలో మా ఇంట్లో ఎన్ని కష్టాలు ఎదురైనా భరించాల్సి వుంటుంది. అసలు ప్రాణాలు వుంటాయో లేదో తెలియదు. బాగా ఆలోచించుకో. కోరి కోరి కష్టాలు కొని తెచ్చుకోకు. నీ మేలు కోరే చెబుతున్నాను." శాంతంగా చెప్పాడు ఫిరోజ్.

"స్త్రీ పురుషుని పెళ్ళి చేసుకున్నప్పుడే తనవారిని మరిచి భర్తను తన ప్రపంచంగా భావిస్తుంది. తన ఇంటిని విడిచి భర్త వున్న చోటే స్వర్గమనుకుంటుంది. నువ్వు మా ఇండియన్ కాదని తెలిసినప్పుడే నేను ఇవన్నీ ఆలోచించాను. కష్టనష్టాలకన్నిటికీ సిద్ధపడే వున్నాను. నువ్వు నా వీసా కోసం ప్రయత్నం చెయ్యి. మీ ఎంబసీ వాళ్ళు ఇవ్వనంటే అప్పుడు ఆలోచిద్దాం. అలా కాదని నన్ను విడిచి ఒక్కడివే వెళ్ళిపోవాలని ప్రయత్నించకు నువ్వు లేకుండా నేను బ్రతకలేను. అక్కడ మీ అమ్మా నాన్నలను మెప్పించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" స్థిరంగా చెప్పింది రమ్య.
"నువ్వంటే కూడా నాకు చాలా ఇష్టం రమ్యా. నిన్ను వదులుకోవాలని నాకు లేదు. సరే ఏం చేద్దాం. నేను పాకిస్థాన్

ఎంబసీకి వెళ్ళి అప్లికేషన్ ఇస్తాను.  తరువాత అంతా ఆ అల్లా దయ. వీసా రాకపోతే నేను ఏమీ చేయలేను. నేను వెళ్ళాలి. నా తల్లిదండ్రుల మాటకు తలవంచి వారికి మనశ్శాంతిని కలిగించాలి" బాధగా చెప్పాడు ఫిరోజ్.

పరాయిదేశంలో ప్రేమలకు, పెళ్ళిళ్ళకు, బంధాలకూ విలువ లేదా. ఇక్కడ ఏదీ శాశ్వతం కాదా. మనుషులంతేనా. అడకత్తెరలో పోకచెక్కలా మారిన తన పరిస్థితిని తలచుకుని ఆలోచిస్తూ కుమిలిపోతోంది రమ్య.

***

రోజంతా తిరిగి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు ఫిరోజ్.

"నా ప్రయత్నం నేను చేసాను. ఎంబసీ అడిగిన పేపర్లన్నీ ఇచ్చి వచ్చాను. రెండ్రోజుల్లో వాళ్ళు మన ఇద్దర్నీ ఇంటర్వ్యూకు పిలుస్తారు.  ముఖ్యంగా నిన్ను చాలా ప్రశ్నలు వేస్తారు. నీకు అన్ని విషయాలూ వివరిస్తారు. నీ జవాబులను బట్టి వీసా వస్తుందో రాదో నిర్ణయిస్తారు" చెప్పాడు అలసటగా మంచంపై వాలుతూ ఫిరోజ్.

"ఏ దేశమైనా, మతమైనా, సాంప్రదాయమైనా ప్రేమకు, పెళ్ళికి వ్యతిరేకం కాదు. ఏ దేశ సంస్కృతి అయినా, చట్టమయినా స్త్రీని గౌరవించకుండా ఆమె మనో భావాలకు విలువ ఇవ్వకుండా వుండదు. ప్రేమ మనుషులనే కాదు ఈ ప్రపంచాన్నే జయిస్తుంది" నమ్మకంగా చెప్పింది రమ్య.

ఒకవేళ వీసావచ్చి నిన్ను మా ఇంటికి తీసుకెళ్ళినా మావాళ్ళు ఒప్పుకోరు కదా. వాళ్ళసలే మూర్ఖులు. మా చిన్నప్పుడే మా చిన్నాన్న కూతురితో నా పెళ్ళి నిశ్చయించేసారు. ఇప్పుడా పిల్లను చేసుకోనని చెబితే కోపంతో నిన్నూ నన్నూ చంపేస్తారేమో" భయపడ్డాడు ఫిరోజ్.

"అందుకే ఇక్కడే కువైట్ లోనే వుండు. ఎందుకు కోరి కోరి సమస్యలను కొని తెచ్చుకోవడం" చెప్పింది రమ్య.

"ఇప్పుడు వెంటనే బయలుదేరి రాకపోతే మా అమ్మ చచ్చిపోతానని బెదిరిస్తోంది. అటు చూస్తే వాళ్ళు ఇటు చూస్తే నువ్వు. నేను ఏమి చేయను నిట్టూర్చుతూ తలపట్టుకున్నాడు ఫిరోజ్.

***

మరుసటి రోజు కువైట్ లోని పాకిస్తాన్ ఎంబసీ వాళ్ళు కాల్ చేసి  వీసా ఇంటర్వ్యూ కు రమ్మని చెప్పారు. అక్కడ వాళ్ళు రమ్యను, ఫిరోజ్ ను ఎన్నో ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా రమ్యను ఇస్లాం గురించి, ఖురాన్ గురించి అడిగి ఆమె అభిప్రాయాలను విన్నారు. ప్రాణాన్ని కూడా లెక్క చేయకుండా శతృ దేశానికి వెళతాను అంటున్న రమ్య ఫిరోజ్ ను ఎంత గాఢంగా ప్రేమిస్తోందో ఆమె మాటల్లో తెలుసుకుని ఆశ్చర్యపోయారు.  వీసా ఇవ్వము అని తిరస్కరించేందుకు ఏ కారణాలూ వారికి కనబడలేదు.

ఇక గత్యంతరం లేక "మొదట నెల రోజులకు మాత్రమే విజిట్ వీసాను ఇస్తాము. కొన్ని ముఖ్యమైన కారణాలతో పాకిస్తాన్ వెళ్ళే భారతీయులందరూ ఫ్లయిట్ దిగగానే మొదట అక్కడి పోలీస్ స్టేషన్లోకి వెళ్ళి వారి పేరును,

వివరాలను పోలీసులకు ఇవ్వాలి. కాబట్టి రమ్య కూడా ఈ విషయాన్ని మరిచిపోవద్దు. పాకిస్తాన్ లోని కొన్ని ప్రదేశాలు మాత్రమే ఆమె సందర్శించవచ్చు. పాకిస్తాన్ లో భారతీయురాలికి స్వతంత్రంగా అన్ని ప్రదేశాలకూ వెళ్ళడానికి అనుమతి లేదు. అక్కడి పోలీసులు ఆమె కదలికలపై ఒక కన్ను వేసే వుంచుతారు. ఒక వేళ ఆమె భారతీయ గూఢచారి వర్గానికి చెందినదైతే మాకు మా దేశానికి సమస్యలు కదా. మీ మీద నమ్మకంతో వీసా ఇస్తున్నాము. ఒకసారి వెళ్ళి అక్కడ పరిస్థితి చూడండి. తరువాత అన్నీ బావున్నాయి అనుకుంటేనే ఆలోచించి నిర్ణయం తీసుకుందాం" చెప్పాడు ఎంబసీ కౌన్సిలర్. సరే అని ఒప్పుకుని వీసా తీసుకుని ఇంటికి వచ్చారు ఇద్దరూ.
అప్పటినుండీ రమ్య రిలాక్సయింది.

కానీ ఫిరోజ్ కు మాత్రం టెన్షన్ మొదలయ్యింది. 'మా అమ్మానాన్నా నిన్ను ఇంట్లోకి రానిస్తారంటావా. గొడవ పెట్టుకోరు కదా' అంటూ ఆలోచిస్తున్నాడు.

ఏదైతేనేం చావైనా నీతోనే. పద అంది రమ్య.

ఆమె ప్రేమకు పట్టుదలకు ఆశ్చర్యపోయాడు ఫిరోజ్. మనసులో సంతోషించాడు.

కువైట్ నుండి పాకిస్తాన్ ఇస్లామాబాద్ ఎయిర్పోర్టుకి టికెట్స్ బుక్ చేసుకున్నారు. కువైట్ ఎయిర్వేస్ లో ప్రయాణం చేసి ఇస్లామాబాద్ లో దిగారు. ఇండియాకు పాకిస్తాన్ కు పెద్ద తేడా ఏమీ కనబడలేదు రమ్యకు.

అక్కడి స్త్రీలు మాత్రం అందరూ పంజాబీ డ్రస్ లు వేసుకుని తలను షాల్ తో కప్పుకుంటున్నారంతే.

ఇస్లామాబాద్ లో ఫ్లయిట్ దిగగానే పోలీస్ స్టేషన్ కు వెళ్ళి రమ్య వివరాలిచ్చి ఎందుకు వచ్చిందో కారణం చెప్పి పేరు నమోదు చేయించారు. తరువాత ఫిరోజ్ ఇంటికి వెళ్ళడానికి భయపడి ఆ రోజు అక్కడే వుందామని చెప్పి హోటల్ రూం తీసుకున్నాడు. ఆ రోజంతా ఇస్లామాబాద్ లోని ముఖ్యమైన ప్రదేశాలు కొన్ని చూపించాడు.

మరుసటి రోజు భయపడుతూ ఫిరోజ్ వాళ్ళ ఊరు జీలం కు వెళ్ళారు.

అక్కడ ప్రాంతమంతా పచ్చటి కొండలతో అందంగా కనబడుతోంది. ఒక వైపు జీలం నది ప్రవహిస్తోంది మరొకవైపు ఆర్మీ స్థావరాలున్నాయి.

"ఇస్లామాబాద్ కొత్త పట్టణం. ఇది కాశ్మీర్ కు దగ్గరగానే వుంటుంది. కాబట్టి ఈ ప్రాంతమంతా కాశ్మీర్ లానే అందంగా వుంటుంది, లాహోర్ పురాతనమైన పట్టణం. అక్కడ బ్రిటిష్ వారి కట్టడాలెన్నో వున్నాయి. భగత్ సింగ్ సమాధి అక్కడే వుంది. వీలయితే అక్కడికి కూడా తీసుకెళ్ళి చారిత్రాత్మక కట్టడాలను చూపిస్తాను" చెప్పాడు ఫిరోజ్.

అందమైన ఆ ప్రాంతాలను కళ్ళు విప్పార్చుకుని చూసింది రమ్య. భయపడుతూనే జీలం సిటీని చేరి ఫిరోజ్ ఇంట్లోకి అడుగు పెట్టారు.పెద్ద గొడవలు జరుగుతాయి అనుకున్నారు కానీ ఆశ్చర్యంగా ఫిరోజ్ అమ్మా నాన్నలు రమ్య చెప్పినదంతా శాంతంగా విన్నారు. రమ్య ఫిరోజ్ కోసం తన పేరును ఫాతిమా అని మార్చుకుందని, ఇస్లాం మతాన్ని స్వీకరించిందని, తన దేశాన్ని తల్లిదండ్రులను కూడా విడిచి రావడానికి సిద్ధపడి వుందని తెలిసి సంతోషించారు. ఆమె అభిప్రాయాలన్నీ తెలుసుకుని అభినందించారు. దేశాలు, కులమతాలు ప్రేమకు అతీతమని, ముందు పాకిస్తాన్, హిందుస్తాన్ ఒకే దేశమని తమ బంధువులు కొందరు అటువైపు ఇండియాలోని హైదరాబాద్ లో వుండిపోయారనీ చెప్పి తమ సహృదయతను చాటుకున్నారు.

సంప్రయదాయబద్దంగా కువైట్ కోర్టులో ఇస్లాం మతసిద్దాంతాల ప్రకారం జరిగిన పెళ్ళిని తాము అంగీకరిస్తున్నామని తెలియజేసారు. ఫిరోజ్ కి సంతోషంతో గాల్లో తేలినట్లుగా అనిపిస్తోంది.

రమ్యకైతే ఇది కలా నిజమా అర్థం కావడం లేదు. నమ్మశక్యంగా లేదు. ఇన్నిరోజులూ ఎంత టెన్షన్ పడ్డారో అదంతా దూదిపింజెలా గాల్లో తేలిపోయినట్లనిపించింది.

అల్లా తన ప్రార్థనలను అంగీకరించాడని చెప్పి ఎగిరి గంతేసి అమ్మానాన్నలకు నమస్కరించాడు ఫిరోజ్. రమ్య కూడా వారి ఔన్నత్యాన్ని కొనియాడుతూ నమస్కరించింది. ముఖ్యమైన బంధువులకు తెలియజేసి ముల్లాను పిలువనంపించి మరలా సంప్రదాయబద్దంగా నిరాడంబరంగా ఫిరోజ్ వివాహాన్ని వారు జరిపించారు.

వచ్చే సంవత్సరానికి మనవడిని ఎత్తుకుని తిరిగి ఇంటికి రావాలని చెప్పారు. నెలరోజులు పాకిస్తాన్ లో సంతోషంగా గడిచింది. హానీమూన్ కి మర్రీ కి తీసుకెళ్ళాడు ఫిరోజ్. (ఈ మర్రీ మన సిమ్లాలా లాగా అందమైన చల్లటి ప్రదేశం. అప్పట్లో బ్రిటిష్ వారికి ఇష్టమైన విడిది ప్రదేశం. కాశ్మీరుకు దగ్గరలో మరో వైపున కొండలపైన వున్నది)

తరువాత ఫాతిమా, ఫిరోజ్ కువైట్ కి తిరిగి వచ్చి ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాన్ని సంతోషంగా గడిపారు. రమ్య ఉరఫ్ ఫాతిమా బేగం ఏడేళ్ళలో ముగ్గురు పిల్లలకు తల్లి అయింది. ఫిరోజ్ తల్లిదండ్రులు ఇద్దరు మనవళ్లను మనవరాలిని చూసి సంతోషించారు. ఇటు ఇండియాలోని రమ్య తల్లి దండ్రులు కూడా మొదట పాకిస్తానీని పెళ్ళి చేసుకున్నందుకు కోపగించుకున్నా తరువాత కాలంతో పాటూ కోపాన్ని మరిచిపోయారు. మనవలను మనవరాలిని చూసి మురిసిపోయారు.

*(మరోకథ వచ్చేనెలలో)*